
# అవకాశముంటే

తెలికుల వీధిలో మూడువంతులమంది మొదలియారులు; ఒక్క తెలికుల వాడేనా లేడు. తెలికులవాళ్ళు వెనక అక్కడ ఉండేవారని వీధి పేరులో మాత్రమె మిగిలిపోయింది. ఈ మొదలియారులది నేతపని.

తెల్లవారి ఆరుకొట్టేసరికి వీధిలో కంగు కంగుమని మోత వినబడుతుంది. మరేమీ కాదు. సరులు పొయ్యడానికి వీధి పక్కని దిగగొట్టే గూటాలచప్పుడు. ఎవడి మగ్గానికి వాడే సేనాపతి అనే సామెత నిజంగా నిరర్థకం కాదేమో! ఎందుచేతంటే ఈ మొదలియారులలో ఒక్కొక్క ఇంటి దగ్గిర ఒక్కొక్క ఇనపగుండు—ఫిరంగి గుండు—ఉంటుంది. ఇవి గూటాలు దిగగొట్టడానికి మహా బాగా పనికివస్తున్నాయి.






నల్ల మొదలియారుకి కడిపెడు పిల్లలు. పాపం మనిషి ఇదయినవాడే! ఇంటిలో కూటాలు బాగా పనికి వస్తున్నాయి. అక్కడే కూర్చుని పనివాళ్ళు నూలుపని చేస్తూంటారు. బాలబాలికలు, యువతులు, ముసలివాళ్ళూ ఉంటారు. నూలుబొందులను పెద్దపంటెలకు చుట్టబెట్టి, వాటిని రాటాలకి తగిలించి చిన్న గుండ్రటి సీనారేకుడబ్బాలకు చుడుతూంటారు. ఈ పని పొద్దున్న ఏడు దగ్గిరనుంచి సాయంత్రం కంటికి నూలు పోగు కనబడేదాకా చేస్తారు. ఇది చాల సులువైన పని కాబట్టి పిల్లలకి ముసలివాళ్లకి పనికివస్తుంది. కాని తగినపని దొరకనందున యువతులు కూడ తమ కాలాన్ని కేవలం వ్యర్థపుచ్చకుండా పాటుపడుతూంటారు.

నల్ల మొదలియారుకి రెండు విధాలుగా లాభం. కూటాలు, గదులు అద్దెకి ఇచ్చుకొన్నాడు. పనివాళ్ళు అమూల ఈమూల, దారులపక్కని, మండువాలోను కూర్చుని కిర్రు కిర్రుమంటూ రాట్నాలు తిప్పుతూ డబ్బాలకి నూలు చుడుతూన్టారు. ఎప్పటి కూలిడబ్బులు అప్పుడే పుచ్చుకోక డబ్బాకొక చిన్న సీనారేకుబిళ్ళ చొప్పున పుచ్చుకొంటారు. తర్వాత తమకి అవసరం వచ్చినప్పుడు ఆ బిళ్ళలని మొదలియారుకిచ్చి డబ్బులు తీసుకొంటారు. మూడేసి బిళ్లలకొక అణా.

కొందరు పనివాళ్ళు నూలుడబ్బాలను తీసుకుపోయి పెద్ద చక్రానికి నూలు చుట్టి, తర్వాత వీధిలో పొద్దున్నపూట, సాయంత్రంపూట సరులు పోస్తారు. ఈ సరులు సింహద్వారానికి ఎదురుగా ఉండడంబట్టి ఇంటిలోకి ఎవరు వెళ్ళినా వీటిని తప్పించుకుని వెళ్ళవలసిందే! ఆ తర్వాత మగ్గాలమీద లుంగీలు నేస్తారు. మొదలియారుకి రెండు మగ్గాలున్నాయి. ఇవి రాత్రి, పగలు, గోడగడియారంలాగు టక్కు టక్కుమంటూంటాయి.

సీనారేకు డబ్బాలకి చుట్టడం చాల సులువైనపని. దానివల్ల వచ్చే ఆదాయం కొంచెం. ఆదాయానికి జీవనానికి సంబంధం లేదన్న సంగతి ఈ కూలివాళ్ళు రుజువు పరుస్తున్నారు. ఎందుచేతంటే, వాళ్లు ఎప్పుడూ చిరునవ్వు మొహాలతోనే ఉంటారు. కాని నల్ల మొదలియారి మొహాన ఎప్పుడూ చిరునవ్వు సింగారించి ఎరగదు. అది లేనివాళ్ళ పొంతకేగాని ఉన్నవాళ్ళ పొంతకి పోదేమో!

కాసులయ్య ఆ ఇంటిలోనే బాడుగకి ఉంటున్నాడు. మొదలియారుకి, అతనికి స్నేహం ఏర్పడింది.

"మొదలియారుగారూ! లుంగీల వ్యాపారం ఎట్లాగుంటూంది?" అని ప్రశ్నించేడు.

"నూలు సప్లై చేస్తున్నామని పేపర్లలో పెద్దపెద్ద రిపోర్టులు వేస్తారు. షావుకారు దగ్గరకి వెళ్ళితే ఇంకా రాలేదంటాడు. కాస్త చెయ్యి తడిచేస్తే 'నీకు మాత్రమే!' అంటూ చెయ్యి విదుపుతాడు!"

"మరి మీకు మీకోటా అందచెయ్యాలి కాదూ!"

"రూలుప్రకారం ఏదీ జరగదండి! జరిపినట్లుగా వాళ్ళు అక్కౌంటు వేసుకొంటారు!"

"మరి మీ మగ్గాలకి కావలసింది ఎక్కడినుంచి తెస్తున్నారు?"

"నల్ల బజారులో ఎప్పుడూ నిలవ ఉంటుంది పాతాళగంగలాగు!"

శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు

"పాపం శమించుగాక!"

"ఈ వ్యాపారంలో లాభాలు రమ్మంటే ఎట్లాగు వస్తాయి చెప్పండి!"

"నిజమే, పాపం!" అన్నాడు కాసులయ్య. అతను మనస్సులో "అయితే ఈ వ్యాపారంవల్ల ఇప్పటిలో లాభంలేకపోవచ్చు. వెనక ఇతడే నల్లబజారులో నూలు, లుంగీలు అమ్మి కూడబెట్టేడన్న సంగతి అందరికీ తెలుసు! అన్నదమ్ముల సొత్తు అపహరించేడన్న సంగతి కొందరు మాత్రమే ఎరుగుదురు! ఏమీ లాభం లేకపోతే కొత్త ఇళ్లు రెండు ఏలాగు కట్టించేడు!" అనుకొన్నాడు.

ఒకరోజున చీకటి పడింది. పనివాళ్లు వెళ్లిపోయేరు. నల్ల మొదలియారు ఒక కూలి కుర్రవాణ్ణి ప్రశ్నిస్తున్నాడు, "నూలు ఏమి చేశావురా? చెప్తావా లేదా?"

"నేను తియ్యలేదండి అయ్యా!" అన్నాడు కుర్రవాడు.

మొదలియారు దగ్గి రొక పేకబెత్తం ఉంది. ప్రత్యేకంగా ఇటువంటి అవసరాలకు పనికి వస్తుంది. దానిని తెచ్చేడు. కుర్రవాడి చేతులమీద, కాళ్ళమీద, తలమీద బాదివేశాడు.

కుర్రవాడు ఏడుస్తూనే "లేదు, లేదండి!" అంటున్నాడు.

(42-వ పేజీ చూడండి)

# "లక్స్ టాయిలెట్ సబ్బు

నా చర్మమును మెత్తగాను, శుభ్రముగాను, మనోహరముగాను ఉంచుచున్నది"

అని ఎస్. మేనక చెప్పుచున్నది




సినీమా తారలకు సౌందర్యమునిచ్చు సబ్బు

మనోహరమైన సువాసనతోగూడిన ఈ తెల్లటి శుద్ధ సబ్బుతో మీ చర్మమును మనోహరముగానుంచుకొనండి.

LTS. 344-X30 TL

★ రాజా - పేదా ★

వెల. రూ. 2-0-0 పోస్టుఖర్చులు ప్రత్యేకం.

ఆంధ్రగ్రంథమాల, పోస్టుబాక్సు 212, మద్రాసు-1.


# అవకాశముంటే

(26-వ పేజీ తరువాయి)

"చెప్తావా లేదా?" అని మళ్లీ తెగబాది వేశాడు. మళ్ళీ అదే జవాబు.

మొదలియారు పునశ్చరణ చేశాడు.

అబద్ధం దయ్యం ఇహ తట్టుకోలేక పోయింది కాబోలు "ఒంటేలుకని చెప్పి వెళుతూ ఒక బొందు తీసుకుపోయేనండి!" అన్నాడు.

మొదలియారు ఊపిరి తిప్పుకోకుండా మళ్లీ బాది వేశాడు.

కుర్రవాడు నోరు నొక్కుకొని ఏ* స్తున్నాడు.

మొదలియారు తన కొడుకుని పంపించి, ఒక కాని బటాణీలు తెప్పించేడు. పనికుర్రవాణ్ణి స్నానాలగదిలోకి వెళ్ళి మొహం, చేతులు, కాళ్ళు కడుగుకొని రమ్మన్నాడు. వాడురాగా కింద కూర్చోమన్నాడు. బటాణీలు వాడి చేతిలో పోశాడు. వాడు ఒక్కటొక్కటే తీసుకొని నములుతున్నాడు.

మొదలియారు తనకొడుకుని కూలి కుర్రవాడి ఇంటికి పంపించి వాడి తండ్రిని పిలిపించేడు. తఅడురాగా "మీఅబ్బాయినూలు బొందు తెచ్చిఇచ్చేడుటే!' అన్నాడు.

"లేందే!" అన్నాడు తండ్రి.

"వాడు తీసుకువెళ్లి ఇచ్చేనని చెప్తాంటేనే!"

"ఏమో నాకు తెలియదు!"

"సరే! వాడు చేసిన ఈరోజు పనికి కూలి డబ్బులు ఇదిగో! తీసుకుపో!" అంటూ మొదలియారు లెక్కకట్టి ఇచ్చివేశాడు.

వాళ్లు వెళిపోయేరు.

కాసులయ్యకి ఆశ్చర్యం వేసింది; మొదలియారు ఇంటిలో లేడుకదా ఈ దొంగతనం ఏలాగు పట్టుకొన్నాడు అని. అతను మొదలియారుని అడగ్గా, "వాడుచుట్టిన డబ్బాలలో నూలు తక్కువ వచ్చింది. వాడు తియ్యకపోతే ఎట్లా తగ్గుతుంది!" అని చెప్పాడు.

మొదలియారి న్యాయగుణానికి కాసులయ్య మెచ్చుకొన్నాడు. అన్ని దెబ్బలు తింటేనేగాని కుర్రవాడికి నిజం పలకాలని తోచలేదు పాపం అని విచారించేడు.

మొదలియారు దగ్గిర పని చేసినవాళ్లు అనేకమంది మారేరు. కాని ముసలయ్య మట్టుకు మారలేదు. నాలుగైదేళ్లనుంచి పని చేస్తున్నాడు. అరవై ఏళ్ళుంటాయి. ఎప్పుడు మాట్లాడినా మొదలియారు పక్షాన్నే మాట్లాడతాడు. మొదలియారు తిటినాసరే, కొట్టినాసరే, వాడుఏడువడు

పరికదా, నొచ్చుకోడు కూడాను.

ముసలయ్యకి సుస్తీచేసింది. క్రమంగా ముదిరింది. 'ఇది వదిలే రోగం కాదు. భారకం పోవడం లేదు' అని వాడి పెళ్లాం చెప్పుతూంది.

ముసలయ్య ఏలాగో ఓపిక చేసుకొని తప్పటడుగులు వేస్తూ మొదలియారింటికి వెళ్లేడు. "సైకం ఇస్తారా?" అని అడిగేడు.

"నీ సైకం ఎక్కడికి పోతుంది?" అన్నాడు మొదలియారు.

"అది కాదండి!"

"నీ సైకం ఎక్కడికీపోదు" అని మొదలియారు హామీ ఇచ్చేడు.

"అది కాదు. నాకు చాల అవసరంగా ఉంది." అని ముసలయ్య ఆరిపోతూన్న దీపాన్ని ఎగసన తోసినట్టుగా కళ్ళలోకి జీవం తెచ్చుకొని చూశాడు.

"ఏమాత్రం?"

"రెండు వందలు!"

"నా దగ్గర ఉంటే నీ కివ్వడియ్యడానికి నాకేమాత్రం అభ్యంతరం లేదు. కాని—"

"ఏదో ముసలివాణ్ణయిపోయేను. ఇంకెంత కాల ముంటాను. పోనీ ఒక కాగితం రాసియ్యండి, నా పెళ్లాం జాగ్రత్త పెట్టుకొంటుంది!"

"ఓరి పిచ్చివాడా! నీకు ఇన్నాళ్లులేని కాగితం ఇప్పుడా అవసరం వచ్చింది. నీ డబ్బు కెన్నడూ భయంలేదు. నాది జవాబు దారి. నీ కిప్పుడు అంతగా అవసరంవస్తే ఒకటో రెండో సర్దుతాను" అన్నాడు మొదలియారు.

ముసలయ్య ఏమి సమాధానం చెప్తాడు. అటు దైవాన్ని నమ్మినా నమ్మకపోయినా, ఇటు మొదలియారుని నమ్మేడు. రెండు రూపాయలు తీసుకుపోయి అప్పటి అవసరం గడుపుకొన్నాడు.

అందరూ అనుమానపడ్డట్లే ముసలయ్య దేహయాత్ర చాలించేడు. మొదలియారు వాడి అంత్యక్రియలు వైభవంగా జరిపించేడు. నిజంగా వాడు పూలరథం ఎక్కి వెళిపోయేడని చెప్పవచ్చు.

ముసలయ్య పెళ్లాం మొదలియారు ఇంటికి వెళ్ళింది "నామొగుడు మీదగ్గర దాచుకొన్న మూడువందలు నాకు ఇచ్చివెయ్యండి. అవసరముంది!" అని అడిగింది.

"నీమొగుడు డబ్బు ఎవరిదగ్గర దాచుకొన్నాడో వాళ్ళని వెళ్ళి అడుగు. నాకు తెలియదు. నా దగ్గరమట్టుకు దాచలేదు."

ముసలిదానికి కన్నీళ్లు జలజల రాలేయి. మనివంత మనిషిని ఏమంటుంది! విల్చుని విల్చుని "నాకడుపున పుట్టి ఋణం తీర్చుకొంటావులే!" అంది. ఆమె నడుస్తూంటే కన్నీటి జడిలో దారి సరిగా కనబడలేదు."

★





డాల్డాతో
తయారుచేయబడినవి

నిజంగా రుచికరమైన వేపకమునకు, కార పదార్థములకు, కాల్చబడిన పదార్థములకు మరియ మిఠాయీలతో సహా అన్నివిధములైన వంటకములకు డాల్డాను వాడండి. అది చాల శుద్ధమైనటువంటిది మరియు పుష్టికరమైనది. డాల్డా సీలు చేయబడిన డబ్బాలలో క్రొత్తగాను, శుభ్రముగాను మిమ్ములను చేరును.




దీనిని తప్పిపోకండి.

ఇంగ్లీషులో క్రొత్తటి డాల్డా వంట పుస్తకము—చిత్రములతోగూడినది—ఒక రూపాయి. తపాలాఖర్చులు ఎనిమిది అణాలు.

ది డాల్డా అడ్వైసరీ సర్వీస్
పోస్ట్ బాక్స్ నంబరు 353, బొంబాయి.

సరియైన ఆహారములో మీకు కావలసిన క్రొవ్వుపదార్థమును ఇచ్చును

HVM. 183-50 TL

